క్లుప్తంగా

శివాలయంలో సామూహిక హారతులు

చుండూరు(భట్టిప్రోలు): చుండూరు మండలం మున్నంగివారిపాలెంలో కొలువైన శివాలయంలో ఆరుద్రోత్సవం పురస్కరించుకుని శుక్రవారం రాత్రి సమరసత సేవా పౌండేషన్ మహిళలు సామూహిక హారతులు కార్యక్రమాన్ని నిర్వహించారు. చుండూరు మండల కన్వీనర్ చీడిపూడి వీరారెడ్డి అధ్యక్షతన జరిగిన కన్వీనర్ల సమావేశంలో వేమూరు సబ్ డివిజన్ ధర్మ ప్రచారక్ క్రాప రవి కుమార్ మాట్లాడారు. ఈ నెల 12న వివేకానందుని జయంతి, 18 నుంచి 26వ తేదీ వరకు భారతమాత పూజ, ఇంటింటికీ హిందూ ధర్మ ప్రచారం వంటి కార్యక్రమాల నిర్వహణపై చర్చించారు. చేపూరి ప్రభుదాసు, నిర్వాహకులు ఏకసిరి కాశయ్య, కారుమూరి వీరారెడ్డి, మహిళా భజన మండలి సభ్యులు పాల్గొన్నారు.

పంట నష్టం పరిశీలన

పిట్టలవానిపాలెం: గత నెలలో మాండూస్ తుపాను ప్రభావంతో దెబ్బతిన్న వరి పొలాలను తహసీల్దార్ చిన్నం సుధారాణి శనివారం సందర్శించారు. పంట నష్టపోయిన రైతుల వివరాలను ఏ విధంగా నమోదు చేశారనే విషయాన్ని తెలుసుకున్నారు. నష్టపోయిన జాబితాలోని 20 శాతానికి పైగా పొలాలను పరిశీలించారు. కోమలిలో నీట మునిగిన వరి ఓదెలను సర్పంచ్ నాగిరెడ్డి రైతులతో కలిసి అధికారులకు చూపించారు. సుదర్శనరావు, వీఆర్వో వీరనాయుడు తదితరులున్నారు.

హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలి

పిట్టలవానిపాలెం: ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని చందోలు ఎస్ఐ రాజశేఖర్ సూచించారు. చందోలు గ్రామంలో శనివారం 'నో యాక్సిడెంట్ డే' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా తన సిబ్బందితో వాహనదారులకు హెల్మెట్ ప్రాముఖ్యతను వివరించారు. చిన్నపాటి రోడ్డు ప్రమాదాల్లో హెల్మెట్ వల్ల ఎలాంటి రక్షణ పొందవచ్చో వివరించారు. జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ ఆదేశాల మేరకు ప్రతి శనివారం ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని తెలిపారు.

ముగిసిన సాయిబాబా జయంతి వార్షికోత్సవాలు

భట్టిప్రోలు: భట్టిప్రోలు రథం సెంటర్‌లోని శ్రీ షిర్డి సాయిబాబా ఆలయంలో 78వ జయంతి వార్షికోత్సవాలు శనివారం ముగిశాయి. ఈ సందర్భంగా సాయిబాబాకు సుగంధ ద్రవ్యాలు, పంచామృతంతో ఏకాదశ రుద్రాభిషేకం నిర్వహించారు. పూజా కార్యక్రమాల్లో బూర్లె విజయ్ కుమార్, రోజా రాణి, ఆత్మూరి వాలేశ్వరరావు, భవాని, తూనుగుంట్ల వెంకట్రామయ్య, సుదంతి దంపతులు పాల్గొన్నారు. గాయత్రి పీఠం (నారా కోడూరు) అనుబంధ శ్రీ బాలా త్రిపుర సుందరీ మహిళా సమాజం ఆర్గనైజర్ అల్లం వెంకటేశ్వరరావు శిష్య బృందం షిర్డి సాయి బాబాకు, దత్తాత్రేయ స్వామికి ఆహుతులతో గాయత్రీ హోమం నిర్వహించారు. మధ్యాహ్నం నారాయణ సేవలో అన్న ప్రసాదాన్ని భక్తులు స్వీకరించారు. కార్యక్రమాలను దేవస్థాన కమిటీ అధ్యక్షులు తమ్మన రమేష్‌బాబు, ప్రధాన కార్యదర్శి బొలిశెట్టి బాలకృష్ణమూర్తి, కోశాధికారి బూర్లె కిరణ్ కుమార్ పర్యవేక్షించారు.

శ్రీరామ నామస్మరణ కోటి మహోత్సవాలు ప్రారంభం

అద్దేపల్లి(భట్టిప్రోలు): భట్టిప్రోలు పంచాయతీ అద్దేపల్లిలోని శ్రీరామ క్షేత్రంలో 72వ శ్రీరామ నామ స్మరణ కోటి మహోత్సవాలు శనివారం వైభవంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా సప్తాక్షరీ గ్రంథములకు పూజ, సంకీర్తనలు జరిగాయి. పూజా కార్యక్రమాలను వేద బ్రాహ్మణులు కూరపాటి సుధాకర్, బ్రహ్మశ్రీ వంగర చలమయ్య సిద్ధాంతి శాస్త్రయుక్తంగా నిర్వహించారు. జై మార్కండేయ భజన సమాజం ఆర్గనైజర్ వంగర వీరాంజనేయులు బృందం ప్రభాత సేవ, సంఘ సభ్యులు శ్రీరామరామ సమష్టి స్మరణ, సప్తాక్షరి జపం, సాధన మండలి బ్రహ్మ విద్యాశ్రమం నిర్వాహకులు విష్ణు సహస్రనామ స్తోత్ర పారాయణం, శ్రీమద్భగవద్గీత పారాయణం నిర్వాణ షటకం, నారాయణోపనిషత్తు కార్యక్రమాలు, నగరోత్సవం నిర్వహించారు. శ్రీ నాగేంద్ర స్వామి భక్త సమాజం ఆర్గనైజర్ పడమటి నాగమల్లేశ్వరరావు బృందం భజన కార్యక్రమం, సాయంత్రం శ్రీరామరామ రజిత పటం, సప్తాక్షరి లిఖిత గ్రంథాలతో నగరోత్సవం, శ్రీ కృష్ణ మురళి యాదవ కోలాటం ఆర్గనైజర్ కొణతం మురళీకృష్ణ బృందం కోలాటం జరిగింది. ఈ కార్యక్రమాలను శ్రీ రామ నామస్మరణ ఆధ్యాత్మిక సంఘం అధ్యక్షులు కొన్నిపాటి భాస్కరరావు, ఉపాధ్యక్షుడు కాగిత దుర్గా ప్రసాద్, సహాయ కార్యదర్శి కాగిత ఆంజనేయులు పర్యవేక్షించారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి 'గడప గడపకు'

ఎమ్మెల్యే కోన రఘుపతి

బాపట్ల: గ్రామాల్లో ప్రజా సమస్యలు పరిష్కరించడానికి, ప్రజలకు మరింతగా మేలు చేయడానికి గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్యే కోన రఘుపతి పేర్కొన్నారు. బాపట్ల మండలం అడవి పంచాయతీ పరిధిలోని రామచంద్రపురం గ్రామంలో శనివారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్యే కోన రఘుపతి పాల్గొని, సంక్షేమ పథకాల లబ్ధిదారులను పలకరించారు. వారికి చేకూరిన లబ్ధిని వివరిస్తూ.. కరపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామంలో అంతర్గత రోడ్లు వేసే విధంగా చర్యలు తీసుకుంటున్నామన్నారు. అడవి పంచాయతీ పరిధిలోని 10 మంది దివ్యాంగులు పూర్తి అంగవైకల్యం ఉండటంతో వారికి రూ.10వేలు పింఛను వచ్చేవిధంగా కృషి చేస్తానని భరోసా ఇచ్చారు. గ్రామంలో తాగు నీటి సమస్యను పరిష్కరిస్తామని, విద్యుత్ సౌకర్యం సకాలంలో అందే విధంగా చూస్తామని చెప్పారు. ప్రజలు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేపట్టిన సంక్షేమ కార్యక్రమాలు మరిచిపోవద్దని సూచించారు. సంక్షేమం, అభివృద్ధి రెండు కళ్లులా సాగుతున్న పాలనను అందరూ ఆశీర్వదించాలని కోరారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు కోకి రాఘవరెడ్డి, నాయకులు బొడ్డు సుబ్బారెడ్డి, నక్కా వీరారెడ్డి, వడ్డిముక్కల డేవిడ్, కోదండం, కొక్కిలిగడ్డ చెంచయ్య తదితరులు ఉన్నారు.



కరపత్రాన్ని వృద్ధురాలికి అందజేస్తున్న ఎమ్మెల్యే కోన రఘుపతి

హస్త కళలల అభివృద్ధికి ప్రభుత్వం కృషి

బాపట్ల అర్బన్: హస్త కళల అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తోందని బాపట్ల ఎమ్మెల్యే కోన రఘుపతి పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర హస్తకళల అభివృద్ధి కార్పొరేషన్(లేపాక్షి) చైర్‌పర్సన్ బడిగించల విజయలక్ష్మి పాండు రంగాపురంలో జరుగుతున్న గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే కోన రఘుపతిని శనివారం కలిశారు. లేపాక్షి ఎంపోరియం స్థాపనకు స్థలం కేటాయించాలని ఎమ్మెల్యేను కోరారు. హస్త కళల అభివృద్ధికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేస్తున్న కృషి ఏ ప్రభుత్వం చేయలేదని ఎమ్మెల్యే ఈ సందర్భంగా అభిప్రాయపడ్డారు. గన్నవరం హస్తకళాకారులు తయారు చేసిన శ్రీ వేంకటేశ్వర స్వామి ప్రతిమను ఆయనకు అందించారు. ఈకార్యక్రమంలో జాతీయ బీసీ సంక్షేమ సంఘం ప్రధాన కార్యదర్శి బడిగించల చంద్రమౌళి, కుమార్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు ప్రోత్సాహమిస్తూ..!

ఆదర్శంగా నిలుస్తున్న 'కొల్లూరు' పూర్వ విద్యార్థులు

కొల్లూరు: నలభై ఏళ్ల క్రితం ఆ పాఠశాలలో చదువుకున్న విద్యార్థులు.. ప్రస్తుతం అదే పాఠశాల విద్యార్థుల చదువుకు ప్రోత్సాహం ఇచ్చేందుకు నడుంబిగించారు. తమ ఉన్నతికి కారణమైన 'బడి'కి ఎంతోకొంత తిరిగివ్వాలనే దృఢ సంకల్పంతో ముందుకొచ్చారు. కొల్లూరు బాలుర, బాలికోన్నత పాఠశాలలకు 1969–70 విద్యా సంవత్సరంలో పదో తరగతి చదివిన విద్యార్థులు రూ.96 వేలు విలువైన.. రెండు లాకర్ల సదుపాయం గల బీరువాలు, ఓ సాధారణ బీరువాను శనివారం వితరణ చేశారు. అంతేకాదు.. భవిష్యత్తులో విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులు అందజేయడానికి వీలుగా.. ఒక్కో పాఠశాలకు లక్ష రూపాయలు వంతున రెండు పాఠశాలలకు రెండు లక్షల రూపాయల నగదును బ్యాంక్‌లో ఫిక్స్‌డ్ డిపాజిట్ చేశారు. తాము చదువుకున్న పాఠశాలపై ఉన్న ఆదరాభిమానాన్ని చాటుకున్నారు. ఈ సందర్భంగా పూర్వ విద్యార్థి నాగళ్ల నరహరి తన భార్య సీతమ్మ జ్ఞాపకార్థం ఇరు పాఠశాలల్లో విద్యలో రాణించిన 14 మంది విద్యార్థులకు రూ.4 వేలు చొప్పున రూ.56 వేలు నగదు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం కె.నాగపాప, పూర్వ విద్యార్థులు ఎం.నాగ భూషణం, సీహెచ్.సాయిబాబు, ఎన్.రాజశేఖర్, కె.రమేష్‌కుమార్, కె.బాబురావు, జి.తాతారావు, బి.లక్ష్మీప్రసాద్, ఎస్.భరత్‌కుమార్, బి.మనోహర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



విద్యార్థినికి నగదు అందజేస్తున్న పూర్వ విద్యార్థులు, హెచ్‌ఎం

నేడు పెదలంకలో 'గడప గడపకు' కార్యక్రమం

భట్టిప్రోలు: భట్టిప్రోలు మండలం పెదలంకలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ఆదివారం ఉదయం 10 గంటలకు నిర్వహించనున్నట్లు ఎంపీడీవో గుమ్మా చంద్రశేఖరరావు, ఎంపీపీ దావూరి వెంకట లలిత కుమారి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రాష్ట్ర సాంఘిక, సంక్షేమ శాఖా మంత్రి డాక్టర్ మేరుగ నాగార్జున పాల్గొంటారని పేర్కొన్నారు. జడ్పీటీసీ, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచులు, పార్టీ నాయకులు, కార్యకర్తలతో మంత్రి నాగార్జున గడప గడపకు తిరిగి సంక్షేమ పథకాల కరపత్రాలను పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. పంచాయతీ, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు విధిగా హాజరు కావాలని పేర్కొన్నారు.

వర్మీ కంపోస్టు తయారీపై దృష్టి సారించాలి

పిట్టలవానిపాలెం: వర్మీ కంపోస్టు తయారీపై దృష్టి సారించాలని సిబ్బందికి ఎంపీడీఓ కె.పద్మజ సూచించారు. మండలంలోని అల్లూరు, ఖాజీపాలెం, పిట్టలవానిపాలెం గ్రామాల్లోని సాలిడ్ వేస్ట్ మేనేజ్ మెంట్ షెడ్‌లను ఆమె శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సేకరించిన తడి చెత్త, పొడి చెత్తను వేరు చేసి వర్మీ కంపోస్టు తయారు చేయాలని సూచించారు. షెడ్‌ల వద్ద పరిశుభ్రత పాటించాలని చెప్పారు. తొట్టి అడుగు భాగంలో కొబ్బరి పీచు లేక కొబ్బరి చిప్పలు వేయాలని తెలిపారు. వర్మీ కంపోస్టు తయారు చేసి సమీప గ్రామ పంచాయతీలకు ఆదర్శంగా నిలవాలన్నారు. వైఎస్సార్ సీపీ నాయకులు కూసంపూడి దేవేంద్రరాజు, కుంతం ప్రసన్న రాజు, గ్రామ కార్యదర్శి శ్రీనివాసరావు, వాలి వెంకట శివారెడ్డి, దాసరి శివకుమార్ ఉన్నారు.



అధికారులకు సూచనలిస్తున్న ఎంపీడీఓ పద్మజ

యూటీఎఫ్ నూతన కార్యవర్గం ఎన్నిక

అధ్యక్షుడిగా హరిబాబు, ప్రధాన కార్యదర్శిగా గణేష్‌రావు

నిజాంపట్నం: యూటీఎఫ్ మండల శాఖ కార్యవర్గ ఎన్నిక శనివారం స్థానిక యూటీఎఫ్ కార్యాలయంలో జరిగింది. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా బాపట్ల జిల్లా అధ్యక్షుడు జె.వినయ్ కుమార్, ఆర్థిక కార్యదర్శి వెంకటేశ్వరరెడ్డి పాల్గొన్నారు. ఎన్నికల అధికారిగా జి.శాంతారావు వహించారు. మండల శాఖ నూతన అధ్యక్షుడిగా డి.హరిబాబు, ప్రధాన కార్యదర్శిగా సీహెచ్ గణేష్‌రావు, గౌరవ అధ్యక్షుడిగా వై.శ్రీనివాసరావు, ఉపాధ్యక్షులుగా షేక్ అబ్దుల్ మాలిక్, లావణ్య, కోశాధికారిగా కె.రాజేష్, సీపీఎస్ కన్వీనర్‌గా నాగరాజు, మహిళా కార్యదర్శిగా ఎస్.పాప ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. అదేవిధంగా జిల్లా కౌన్సిలర్స్‌గా బీవీ రమణ, పి.రామకృష్ణ, డి.సహదేవరావు, నాగ బసవయ్య, ఏడుకొండలు, వైపీ మాణిక్యారావు, పార్వతమ్మ, రాము ఎన్నికయ్యారు.కీ కార్యక్రమంలో సీహెచ్ బాపయ్య తదితరులు పాల్గొన్నారు.



అధ్యక్షుడు డి.హరిబాబు



ప్రధాన కార్యదర్శి గణేష్‌రావు

నేడు ముగ్గుల పోటీలు

భట్టిప్రోలు: భట్టిప్రోలు వాసవి క్లబ్, సంతూర్ కంపెనీ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సంక్రాంతి సంబరాల్లో భాగంగా స్థానిక శ్రీ వాసవి కన్యకాపరమేశ్వరి దేవస్థానంలో ఆదివారం ఉదయం 10 గంటలకు ముగ్గుల పోటీలు నిర్వహించనున్నట్లు క్లబ్ నిర్వాహకులు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులుగా మూడు జార్ల మిక్సర్ గ్రైండర్, ఐదు లీటర్ల ప్రెషర్ కుక్కర్, 1.5 లీటర్ ఎలక్ట్రికల్ కెటిల్ అందించనున్నట్లు పేర్కొన్నారు. కన్సోలేషన్ బహుమతులతో పాటు పోటీలలో పాల్గొన్న ప్రతి మహిళకు కామన్ గిఫ్ట్ ఇవ్వనున్నట్లు తెలిపారు. రంగులు, ముగ్గులు ఎవరికి వారు తెచ్చుకోవాలని పేర్కొన్నారు.

ఆటోలో వస్తారు.. మోటార్లు, బ్యాటరీలు ఎత్తుకెళ్తారు

ముగ్గురు మహిళా దొంగల అరెస్ట్

వేమూరు: దొంగతనాలకు పాల్పడుతున్న ముగ్గురు మహిళలను అరెస్టు చేసినట్లు ఎస్ఐ చోడయ్య శనివారం తెలిపారు. ఆయన వివరాల మేరకు.. చెరుకుపల్లి గ్రామానికి చెందిన రాజేష్, మేరీ, మహాలక్ష్మి, మహాకాళి కాగితాలు కోసం తిరుగుతూ.. దొంగతనాలకు పాల్పడుతున్నట్లు వెల్లడించారు. ఈ నెల 4న జంపని షుగర్ ఫ్యాక్టరీలో దొంగతనం చేస్తుండగా సెక్యూరిటీ గార్డులు ముగ్గురు మహిళలను పట్టుకుని పోలీసులకు అప్పగించారని ఎస్ఐ తెలిపారు. జంపని షుగర్ ఫ్యాక్టరీ మూత పడటంతో ఫ్యాక్టరీలో ఉన్న విద్యుత్ మోటర్లు దొంగతనం చేసేందుకు వారు వచ్చినట్లు చెప్పారు. చెరుకుపల్లి గ్రామానికి చెందిన రాజేష్ అనే వ్యక్తి ప్రతి రోజూ ఈ ముగ్గురు మహిళలను ఆటోలు తీసుకొని వచ్చి ఫ్యాక్టరీ వద్ద వదిలి వెళ్తాడని, దొంగతనం చేసిన వస్తువులతో వారిని తిరిగి ఆటోలో తీసుకెళ్తాడని తెలిపారు. గతంలో అమర్తలూరు మండల కేంద్రంలోని సెల్ టవర్ బ్యాటరీలు, కర్లపాలెంలో విద్యుత్ మోటర్లు, భట్టిప్రోలు మండలంలో విద్యుత్ మోటర్లు దొంగతనం చేసినట్లుగా మహిళలు ఒప్పుకున్నారని ఎస్ఐ తెలిపారు. రాజేష్ పరారీలో ఉన్నాడని, మహిళలను అరెస్ట్ చేసి, తెనాలి కోర్టుకు హాజరు పరిచినట్లు ఆయన వెల్లడించారు.

వృద్ధులకు దుస్తుల పంపిణీ

యాజలి(కర్లపాలెం): వృద్ధులకు చేయూతనందించడం మానసిక సంతృప్తినిస్తుందని బాపట్ల నియోజక వర్గం కాపు సంఘం అధ్యక్షుడు ఇక్కుర్తి శ్రీనివాసరావు తెలిపారు. బాపట్ల లయన్స్ క్లబ్ కార్యదర్శి యజ్ఞనారాయణ దంపతులు తమ కుమారుడు ఆద్విక్ పుట్టినరాజు సందర్భంగా శనివారం యాజలి వృద్ధాశ్రమంలోని వృద్ధులకు, మానసిక దివ్యాంగులకు నూతన దుస్తులు అందజేశారు. ఈ సందర్భంగా యజ్ఞనారాయణ మాట్లాడుతూ తమ కుమారుని పుట్టినరోజు వేడుకలు వృద్ధులతో కలసి జరుపుకోవడం ఆనందంగా ఉందని చెప్పారు.

ఉచిత వైద్య శిబిరం రేపు

రేపల్లె: పట్టణంలోని ప్రభుత్వ వైద్యశాల ఆవరణంలో ఈ నెల 9న ఉదయం 10.30 గంటలకు ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ రేపల్లె బ్రాంచ్ ఆధ్వర్యంలో విజయవాడ అనుమైబీబీ సహకారంతో ఉచిత వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు రెడ్‌క్రాస్ సొసైటీ చైర్మన్ డాక్టర్ వసంతం వీర రాఘవయ్య శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. శిబిరంలో తల్లి, బిడ్డలకు, గర్భిణులకు ఉచిత వైద్య పరీక్షలు నిర్వహించి, మందులు అందించనున్నట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని సద్వినియోగంచేసుకోవాలని పేర్కొన్నారు.

వైఎస్సార్ బీమా నగదు అందజేత

కర్లపాలెం: కర్లపాలెం గ్రామానికి చెంది సోమన శ్రీనివాసరావు భార్య నాగేంద్రం అనారోగ్యంతో ఇటీవల మృతిచెందారు. మట్టి ఖర్చుల నిమిత్తం వైఎస్సార్ బీమా నగదు రూ.10వేలు మృతురాలి భర్త శ్రీనివాసరావుకు శనివారం సర్పంచ్ నక్కా లలితకుమారి అందజేశారు. మిగతా రూ.90వేలు త్వరలో అధికారులు అందజేస్తారని ఆమె తెలిపారు. ఎంపీటీసీ ఎస్కే ఆసిఫ్ అలీ, కో-ఆప్షన్ సభ్యుడు ఎండీ అమీర్‌బేగ్, ఉప సర్పంచ్ పఠాన్ అహ్మద్ భాషా, కార్యదర్శి ఎం.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

మాస్టర్ అథ్లెటిక్స్‌లో సత్తా చాటిన శ్రీనివాసరెడ్డి

బాపట్ల : గుంటూరులో జరిగిన 40వ ఏపీ స్టేట్ మాస్టర్స్ అథ్లెటిక్స్ పోటీల్లో బాపట్లకు చెందిన కోకి శ్రీనివాసరెడ్డి సత్తా చాటారు. 200మీటర్లు, 1500 మీటర్లు పరుగుపందెంలో రెండో స్థానంలో నిలిచి సిల్వర్ బహుమతి పొందారు. ఈ సందర్భంగా శనివారం బాపట్ల మండలంలోని కొత్తపాలెం గ్రామస్తులు, యువత ఆయనను ఘనంగా సన్మానించారు.

మెరక భూములకు పట్టాలివ్వాలి

కొల్లూరు: కృష్ణా నది తీర ప్రాంతంలోని మెరక భూముల్లో పేదలకు పట్టాలివ్వాలని సీపీఎం, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు శనివారం డిమాండ్ చేశారు. ఈ మేరకు పెదలంక, చింతర్లంక ఎస్సీ కాలనీ వాసులను వెంట తీసుకొని మెరక భూముల్లో చెట్లు, మొక్కల తొలగింపు చేపట్టారు. నదిలోని దిబ్బల్లో భూమి లేని రైతులకు పట్టాలు మంజూరు చేయాలని గతంలో అధికారులను కోరినప్పటికీ ఎటువంటి ప్రయోజనం లేదని, దీంతో చెట్లు తొలగించి బాగుచేసుకుంటున్నట్లు వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు ఈ సందర్భంగా వెల్లడించారు. అధికారులు వెంటనే స్పందించి, నదీ భూములకు పట్టాలివ్వని పక్షంలో అధిక సంఖ్యలో ప్రజలను కూడగట్టి పోరాటం ద్వారా భూములను స్వాధీనం చేసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం, సీపీఎం నాయకులు టి.కృష్ణమోహన్, తోడేటి సురేష్, బొనిగల సుబ్బారావు పాల్గొన్నారు.

అగ్నిప్రమాద బాధితురాలికి సాయం

కుచ్చెళ్లపాడు(వేమూరు): రెడ్ క్రాస్ స్వచ్ఛంద సేవా సంస్థ అధ్వర్యంలో అనేక సేవా కార్యక్రమాలు చేపట్టడం జరుగుతోందని బాపట్ల జిల్లా రెడ్ క్రాస్ బ్రాంచ్ వైస్ చైర్మన్ వసంత వీర రాఘవయ్య తెలిపారు. వేమూరు మండలంలోని కుచ్చెళ్లపాడు గ్రామంలో గత నెల పూరిల్లు దగ్ధమవడంతో.. బాధితురాలు దాసరి సీతమ్మ కుటుంబానికి ఆర్థిక సాయం, నిత్యావసర వస్తువులు శనివారం అందజేశారు. మార్కెట్ యార్డు చైర్మన్ బొల్లిముంత ఏడుకొండలు, సర్పంచ్ గాజుల వెంకట సుబ్బయ్య, రెడ్ క్రాస్ సొసైటీ కార్య నిర్వాహక కమిటీ సభ్యులు అడుసుపల్లి మల్లిఖార్జునరావు, సయ్యద్ కరీముల్లా, కూరగంటి శ్రావణ్ కుమార్, కారుమూరి లక్ష్మణ్, అర్ఐ వెంకటేశ్వరావు, వీఆర్వో శివకుమార్, మాజీ ఎంపీటీసీ కనపర్తి సజ్జనరావు తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

నేడు పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

భట్టిప్రోలు: భట్టిప్రోలు టీఎంరావు ఉన్నత పాఠశాల పదో తరగతి 1984 బ్యాచ్ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం నిర్వహించనున్నట్లు నిర్వాహకులు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా పూర్వ విద్యార్థుల పాత, కొత్త ఫొటోల ప్రదర్శన, తమ బ్యాచ్‌లో పరమపదించిన విద్యార్థులు, గురువులకు శ్రద్ధాంజలి ఘటించడం జరుగుతుందని తెలిపారు.

వాసవీ క్లబ్ కార్యవర్గం ప్రమాణ స్వీకారం

వెల్లటూరు(భట్టిప్రోలు): భట్టిప్రోలు వెల్లటూరు వాసవీ క్లబ్ నూతన కార్యవర్గం ప్రమాణ స్వీకార కార్యక్రమం శనివారం స్థానిక ఆర్యవైశ్య కల్యాణ మండపం ఆవరణలో అట్టహాసంగా జరిగింది. అధ్యక్షుడిగా నాగళ్ల ఆంజనేయులు, కార్యదర్శిగా నంబూరు పవన్ కుమార్, కోశాధికారిగా నంబూరు ప్రసాద్, కార్యవర్గ సభ్యులు ప్రమాణ స్వీకారం చేశారు. ముఖ్య అతిథులుగా జిల్లా గవర్నర్ గోనుగుంట్ల జయంత్ కుమార్, మాడా వెంకట సుబ్బారావు పాల్గొన్నారు. గత సంవత్సరం వాసవీ క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహించిన సేవా కార్యక్రమాలను కొనియాడారు. నంబూరు తేజ కుమార్, నంబూరు నాగ భూషణరావు, తూనుగుంట్ల శ్రీధర్, నంబూరు మణికంఠ, బొలిశెట్టి శ్రీనివాసరావు, సుగ్గుల రామకృష్ణ, గోలి చంద్రయ్య, క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

టీబీ బారిన పడకుండా జాగ్రత్తలు పాటించాలి

నిజాంపట్నం: టీబీ వ్యాధి బారిన పడకుండా ప్రతి ఒక్కరూ జాగ్రత్తలు పాటించాలని హెల్త్ సూపర్ వైజర్ మురళీ పేర్కొన్నారు. కూచినపూడి ప్రాథమిక ఆరోగ్యకేంద్రం పరిధిలోని కూచినపూడి గ్రామంలో వైద్య, ఆరోగ్య శాఖ అధికారులు, సిబ్బంది ఇంటింటికి వెళ్లి టీబీ సర్వే నిర్వహించారు. ఈ సందర్భంగా మురళీ మాట్లాడుతూ.. రెండు వారాలకు మించి దగ్గు, అకారణంగా బరువు తగ్గుతున్నా వెంటనే వైద్య పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. టీబీ లక్షణాలున్న వారిని గుర్తించి, రక్త పరీక్షలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. టీబీ బాధితులకు ఆరు నెలలు ఉచిత వైద్యం ఇవ్వనున్నట్లు చెప్పారు. వ్యాధిని ముందుగానే నిర్ధారిస్తే నివారించవచ్చన్నారు. కార్యక్రమంలో సిబ్బంది వెంకటేశ్వరరావు, చంద్ర, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

భట్టిప్రోలులో విద్యుత్ మీటర్ల తనిఖీ
–రూ.4.20లక్షల చలానా వసూలు

భట్టిప్రోలు: విద్యుత్ చౌర్యం నేరమని విద్యుత్ శాఖ విజిలెన్స్ అధికారి ఎస్ఈ అల్ఫన్స్, ఈఈ కేవీఎల్ ఎస్.మూర్తి పేర్కొన్నారు. భట్టిప్రోలులో శనివారం విద్యుత్ మీటర్ల తనిఖీ చేపట్టారు. ఈ సందర్భంగా వారు విలేకరులతో మాట్లాడుతూ.. 56 బృందాలు 4,704 సర్వీసులను తనిఖీ చేసినట్లు చెప్పారు. వివిధ కేటగిరీల్లో అధిక లోడు, డైరెక్ట్ ట్యాంపరింగ్ ఫైన్ విధించినట్లు చెప్పారు. 110 సర్వీసులకు అధిక లోడ్ చార్జీలు కింద రూ.4 లక్షలు, తప్పుడు క్యాటగిరీ విభాగంలో 5 సర్వీసులకు రూ.20 వేలు అపరాధ రుసుం విధించడం జరిగిందని చెప్పారు. ఈ తనిఖీలలో డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లు ఎన్. భాస్కరరావు, భట్టిప్రోలు ఏఈ పి.ఏడుకొండలు, డీఈఈలు, ఏఈఈలు, విద్యుత్ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

బాపట్ల గ్రంథాలయం తనిఖీ

బాపట్ల అర్బన్: బాపట్ల గ్రంథాలయం రికార్డుల నిర్వహణ సంతృప్తికరంగా ఉందని జిల్లా గ్రంథాలయం చైర్మన్ బత్తుల దేవానంద్ తెలిపారు. బాపట్ల గ్రంథాలయాన్ని శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. రీడర్స్ కోరిన, ఆన్ డిమాండ్ ద్వారా తెప్పించిన పుస్తకాలను స్టాక్ రిజిష్టర్‌లో నమోదు చేయాలని సూచించారు. పాఠకులకు కావలసిన ఏర్పాట్లు గురించి తగిన సలహాలు సూచనలు ఇచ్చారు. దాతలు సహాయ సహకారాలతో గ్రంథాలయ అభివృద్ధికి చర్యలు తీసుకోవాలని సూచించారు.

బీసీ కులాల జన గణనన చేపట్టాలి

బాపట్ల: బీసీ కులాల జన గణనన వెంటనే చేపట్టాలని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు అంగిరేకుల వరప్రసాద్ పేర్కొన్నారు. బాపట్లలోని బీసీ సంఘం కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో అంగిరేకుల మాట్లాడారు. రాష్ట్రంలో 51.4శాతం జనాభా ఉన్న బీసీ జన గణనన చేపట్టాలని కోరారు. రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సచివాలయ వ్యవస్థ ద్వారా బీసీ కార్పొరేషన్ల ద్వారా జనగణన చేపట్టాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఓబీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర నాయకులు ఆవుల వెంకటేశ్వర్లు, బీసీ విద్యార్థి సంఘ రాష్ట్ర కన్వీనర్ ఉల్లిపాయల మురళీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి సరఫరాకు అంతరాయం

భట్టిప్రోలు: భట్టిప్రోలు పంచాయతీ పరిధిలోని అద్దేపల్లి రక్షిత మంచినీటి సరఫరా పథకం డెలివరి గేట్ వాల్ మరమ్మతులకు గురైంది. దీంతో తాగునీటి సరఫరాకు అంతరాయం ఏర్పడిందని సర్పంచ్ దారా రవి కిరణ్మయి శనివారం తెలిపారు. మరమ్మతులు చేపట్టి ఆదివారం తాగునీటి సరఫరా పునరుద్ధరించనున్నట్లు చెప్పారు. ప్రజలు సహకరించాలని కోరారు.